క్లుప్తంగా

నేడు లక్ష్మీ నృసింహస్వామి కాలనీలో లావణ్య ప్రచారం

మంగళగిరి: వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి మురుగుడు లావణ్య శనివారం ఉదయం నగరంలోని లక్ష్మీ నృసింహస్వామి కాలనీలో, సాయంత్రం కార్పొరేషన్ పరిధి యర్రబాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పాల్గొంటారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఫిరంగిపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఫ్రైడే- డ్రైడేలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై శుక్రవారం పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేరురాణి మాట్లాడుతూ ఇంటి చుట్టుపక్కల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. నీటి తొట్లు ప్రతి వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలని, తాగునీటి కుండలను శుభ్రం చేసుకోవాలని సూచించారు.

చలివేంద్రం ప్రారంభం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాంధీబొమ్మ సెంటర్లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ వేసవిలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ప్రతి రోజు పరిశుభ్రమైన మంచి నీరు తమ సంఘం ద్వారా ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దాచేపల్లి నరేంద్ర కుమార్, కొత్తమాసు వెంకటేశ్వర్లు, గుగ్గిళం మధుసూదనరావు, కె.పున్నారావు, డి.సాయి, డి. శ్రీనివాస్, ఎ.కోటేశ్వరరావు, ఎస్.విష్ణుకిరణ్‌లున్నారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులోని ఎంపీపీఎస్ ఉర్దూ పాఠశాలను ఎంఈఓ మహబూబ్‌సుభాని శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి తగిన సూచనలు ఇచ్చారు. ఎంఈఓ మాట్లాడుతూ వేసవి ఎండలు తీవ్రంగా ఉండటంతో పిల్లలకు గంటగంటకు తాగునీరు అందించేలా చూడాలని చెప్పారు. ఈనెల 23లోగా పరీక్షలకు సంబంధించిన పేపర్లు మార్కుల జాబితాలు సిద్ధం చేయాలని హెచ్‌ఎంలను కోరారు. 24 నుంచి వేసవి సెలవులు ఇస్తుండటంతో విద్యార్థులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం కృష్ణాలీఫాతిమా ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ అక్కుల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. తాడేపల్లి సెటిల్‌మెంట్ కాలనీ, సుందరయ్య నగర్ కట్ట ప్రాంతాల వినియోగదారులకు సహకరించాలని ఆ ప్రకటనలో కోరారు.

మంగళగిరి పరిధిలో..

మంగళగిరి: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్ పరిధి నూతక్కి, చిర్రావూరులో శనివారం ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు, పెదవడ్లపూడి, కాజ, చినకాకాని ఇండస్ట్రియల్ ఏరియాల్లో ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ అక్కుల సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేసవిలో తీరనున్న నీటి కష్టాలు

- సాగర్ జలాలతో నిండిన చెరువులు
- సరఫరాకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



నీటితో నిండుగా మేరికపూడి చెరువు

ఫిరంగిపురం: వేసవి అంటే తాగునీటి సమస్య గుర్తుకొస్తుంది. చెరువులు ఎండిపోయి, భూగర్భ జలాలు అడుగంటి నీటి చుక్క లేక అల్లాడుపోతుంటాం. అలాంటి పరిస్థితి రాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తాగునీటి అవసరాలు తీర్చే విధంగా సాగర్ నీటిని విడుదల చేసింది. చెరువులు నింపే విధంగా అధికారులను సన్నద్ధం చేసింది.

చెరువులకు జలకళ: మండలంలోని మేరికపూడి, మునగపాడు, గుండాలపాడు, వేమవరం, కండ్రిక, సుదురుపాడు, రేపూడి, వేములూరిపాడు, ఫిరంగిపురం గ్రామాల్లో చెరువులను సాగర్ జలాలతో నిండుగా నింపుతున్నారు. నిలువ చేస్తున్న నీటిద్వారా మూడు నెలలకుపైబడి తాగునీటి ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు.

రేపూడి సమగ్రరక్షిత మంచినీటి పథకం కింద ఫిరంగిపురం, రేపూడి గ్రామాల పరిధిలోని సమగ్రరక్షిత తాగునీటి పథకం ద్వారా వేమవరం, ఫిరంగిపురం, రేపూడి, కండ్రిక, 113 తాళ్లూరు, శిరంగిపాలెం గ్రామాలకు ఆర్‌ఎస్‌ఎఫ్ ఫిల్టర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తారు. రేపూడి గ్రామంలోని చెరువును నింపేందుకు మోటారు ఇంజిన్లు వాడుతున్నారు. సాగర్ జలాల సరఫరాలో భాగంగా గుంటూరు బ్రాంచి కెనాల్ ఉపభాగం అయిన కొండవీటి మేజర్, గుండాలపాడు మేజర్‌దానిలో మరో ఉపభాగం రేపూడి సీ మైనర్ ద్వారా చెరువుకు జలాలను సరఫరా చేస్తున్నారు. దానికోసం ఆరు మోటార్లు, ఎనిమిది ట్రాక్టర్ ఇంజిన్ల సహాయంతో నీటిని చెరువుకు సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగా కొన్ని ప్రాంతాల్లో కట్టలు బలహీనంగా ఉన్న చోట్ల ఇసుక బస్తాలు వేసి పటిష్టం చేశారు.



మోటార్లతో రేపూడి చెరువుకు నీరు

తగిన చర్యలు చేపట్టాం



సాగర్ జలాలతో అన్ని గ్రామాల్లోని చెరువులను నీటితో నింపేందుకు తగిన విధంగా చర్యలు తీసుకున్నాము. ప్రజలు నీటిని వృధాచేయకుండా వేసవిలో వాడుకోవాలి. ఆయా గ్రామాల్లోని నీటిని సరఫరా చేసే ట్యాంకులను ఆయా గ్రామాల పంచాయతీ వారు 15రోజులకో మారు శుభ్రం చేసుకోవాలి. దీని ద్వారా పరిశుద్ధమైన నీరు అందుతుంది.

– ఎ.రామకృష్ణ, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకుందాం



వృద్ధుడికి కరపత్రం అందజేస్తున్న మేకతోటి హర్షిత్ బాబు

తాడికొండ: ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధి అందాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కుమారుడు హర్షిత్ బాబు కోరారు. శుక్రవారం తాడికొండ 7వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం పార్టీ భేదం లేకుండా జగనన్న పాలన అందించినట్లు చెపఆపరు. రాష్ట్రంలో 35 లక్షల ఇళ్ల స్థలాలు, అందులో పక్కా ఇళ్ల నిర్మాణం జరిగి ప్రతి పేదవాడు లక్షాధికారి అయ్యాడనడంలో సందేహం లేదన్నారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సంక్షేమ పథకాలను అందించి దేశంలోనే బెస్ట్ సీఎంగా పేరుతెచ్చుకున్నారని పేర్కొన్నారు. తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో నిలిచిన తల్లి మేకతోటి సుచరితను, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ షేక్ నగీనా, ఉప సర్పంచి వెంకటరెడ్డి, మాజీ సర్పంచి తుమ్మల రామస్వామిరెడ్డి, విశ్రాంత బ్యాంకు మేనేజర్ తుమ్మల తిరుపతిరెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి తోకల నరసింహారావు, ఎంపీటీసీ దాసు, ఉండవల్లి నరసింహారావు పాల్గొన్నారు.

రంగస్థల వేదికపై అలరించనున్న 'మట్టి మనిషి'

- 24న హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రదర్శన
- దర్శకత్వం వహించిన ప్రఖ్యాత దర్శకురాలు నస్రీన్ ఇషాక్



మట్టిమనిషి నవల

తెనాలి: చేబ్రోలుకు చెందిన సుప్రసిద్ధ రచయిత డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి నవల 'మట్టిమనిషి' రంగస్థల నాటకంగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ప్రముఖ నాటక సంస్థ నిభా థియేటర్ ఎన్సెంబుల్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ సాయంత్రం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ నాటికను ప్రదర్శించనున్నారు. తెనాలి నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ ఈ నవలను నాటకీకరించగా, సుప్రసిద్ధ రంగస్థల నటి, దర్శకురాలు నస్రీన్ ఇషాక్ దర్శకత్వంలో ప్రదర్శనకు సిద్ధమైంది. డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి మెమోరియల్ ఫౌండేషన్ సహకారం అందిస్తోంది. 1970లో 'మట్టిమనిష' నవల ఓ దినపత్రికలో ఆదివారం అనుబంధంలో సీరియల్‌గా ప్రచురితమైంది. 1972లో ప్రచురితమైంది. 1995–2000లో ఉస్మానియా యూనివర్శిటీ ఎంఏ ఫైనల్ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపిక చేసింది. నేషనల్ బుక్‌ట్రస్ట్ ఆఫ్ ఇండియా 14 భారతీయ భాషల్లోకి అనువదించి ప్రచురింపజేశారు.

'మాస్టర్ పీసెస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్' అనే కాలమ్‌లో ప్రస్తావించిన నన్నయ నుంచి నేటి వరకు వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప రచనల్లో 'మట్టిమనిషి' నవలను 13వ రచనగా పేర్కొన్నారు.

నూతనోత్తేజం నస్రీన్ ఇషాక్

నాటక దర్శకురాలు నస్రీన్ ఇషాక్‌కు 20 ఏళ్లకు పైగా అనుభవముంది. ఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్‌ఎస్‌డీ)లో గ్రాడ్యుయేషన్ చేశారు. నటిగా సుప్రసిద్ధ దేశ, విదేశీ నాటకరంగ దర్శకులతో పనిచేశారు. ఎన్‌ఎస్‌డీలో నటిగా ఏడేళ్ల అనుభవం. వివిధ సంస్థల్లో చలనచిత్ర అధ్యాపకురాలిగా, డబ్బింగ్ కళాకారిణిగా, కాస్ట్యూమ్ డిజైనర్‌గా, థియేటర్ ఆర్ట్స్ అధ్యాపకురాలిగా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ గెస్ట్ లెక్చరర్‌గా చేశారు. హైదరాబాద్‌లోని 'సమాహార' అనే సంస్థ సహచర్యంతో తన సొంత గ్రూప్ 'నిభా థియేటర్ ఎన్సెంబుల్'తో 2016 నుంచి నాటకాలకు దర్శకత్వం వహిస్తున్నారు. పలు విదేశీ నాటకాలను హిందీలోకి అనువదించారు. చలం రచించిన 'మైదానం' నవలను రంగస్థలంపైకి తీసుకురావటం గొప్ప ప్రయోగం. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ 'పాకుడురాళ్లు' నవలను అదే పేరుతో నాటకంగా తీసుకొచ్చారు. మళ్లీ ఇప్పుడు వాసిరెడ్డి సీతాదేవి నవల 'మట్టిమనిషి'ని నాటకంగా జనంలోకి వస్తోంది.

25 నుంచి సంస్కృత భాష శిక్షణ తరగతులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస శర్మ, మురళీకృష్ణ

తెనాలిఅర్బన్: కోట లక్ష్మయ్యనాయుడు సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శ్రీ వైఖానస సేవా సంఘం తెనాలి వారి సహకారంతో ఈ నెల 25 నుంచి గంగానమ్మపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో సంస్కృత భాషా ప్రవేశ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. వేణుగోపాలస్వామి దేవస్థానం ఆవరణలో శుక్రవారం శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ ధార్మిక ప్రచారకులు డాక్టర్ డీఎస్ దీక్షితులు, దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి మల్లీశ్వరిలు తరగతులను ప్రారంభిస్తారని చెప్పారు. ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. సూరేపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ప్రముఖ సంస్కృత పండితులు బ్రహ్మశ్రీ కుచిబట్ల శ్రీనివాసశర్మ శిక్షణ ఇస్తారన్నారు. తెనాలి పట్టణం, పరిసర గ్రామాల్లోని పెద్దలు, పిల్లలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డి.మురళీకృష్ణ, మేడూరి శ్రీనివాసమూర్తి, పి.వినాయకరావు, సిహెచ్.రామలింగేశ్వరరావు, టి.రఘునాగమల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పల్లె పల్లెన దళిత ఘీంకారం సమావేశాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్

నెహ్రూనగర్: దళిత సమాజం ఎదుర్కొంటున్న కొన్ని సంఘటనలపై పల్లె పల్లెన దళిత ఘీంకార చైతన్య సమావేశాలు డిసెంబర్ వరకు నిర్వహించనున్నట్లు భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం అరండల్‌పేటలో భీమ్ భారత్ కార్యాలయంలో చైతన్య సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రస్తుతం దళిత గిరిజనులకు కల్పిస్తున్న రిజర్వేషన్ల విధానం అనేది ఒక తాత్కాలిక ఉపశమనంగానే పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిన్నతనం నుంచే అంటరాని తనాన్ని అనుభవించి భావితరాల వారు తాను అనుభవించిన వివక్ష అనుభవించకూడదనే ఉద్దేశంతో విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు తీసుకువచ్చారన్నారు. రిజర్వేషన్ల ఫలాలు అనుభవించిన వారు తిరిగి సమాజానికి మేలు చేయకపోగా రాజకీయ పార్టీలకు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. అణగారిన వర్గాల అభ్యున్నతి, అభివృద్ధే ధ్యేయంగా పల్లె పల్లెన చైతన్య సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సంఘ నాయకులు రాజేంద్రప్రసాద్, కమల్‌కుమారి, మామిడి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నెహ్రూనగర్: స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా నగరంలోని గౌడ సేవా ట్రస్ట్ బిల్డింగ్‌లో లచ్చన్న విగ్రహ కమిటీ, అర్బన్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రావుల మణి మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న మహాత్మా గాంధీ, ఎన్‌జీ రంగా పిలుపు మేరకు ఉప్పు సత్యాగ్రహంలో, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. అదే విధంగా బడుగు, బలహీన వర్గాల సమస్యల కోసం అహర్నిశలు పోరాటం చేసిన మహనీయుడు లచ్చన్న అని కొనియాడారు. సంఘ నాయకులు డాక్టర్ దుర్గాప్రసాద్, చెన్ను శ్రీనివాస్‌కుమార్, గాలి సుబ్బారావు, న్యాయవాది కె.లక్ష్మీనారాయణ, దాసరి వెంకట్రావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న బహుజనవాది

పెదకాకాని: పెదకాకాని గౌడపాలెం సర్దార్ గౌతు లచ్చన్న భవన్‌లో శుక్రవారం గౌతు లచ్చన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గౌడ ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షులు బొర్రా అంకయ్య అధ్యక్షత వహించారు. రాష్ట్ర బీసీ నాయకుడు కుక్కల రామ్ ప్రసాద్ లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్దార్ గౌతులచ్చన్న బహుజనవాది అని కొనియాడారు. ప్రజా సమస్యలపై ముఖ్యంగా కార్మిక, కర్షక, అంటరాని తనానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నడపడంతో పాటు వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని ధారపోసిన సౌమ్య శీలుడు లచ్చన్న అని శ్లాఘించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉప్పాల శివాజీ, క్రోసూరు పూర్ణచంద్రరావు, కుక్కల మల్లేశ్వరరావు, కారంకి వెంకటేశ్వరరావు, పాగోలు శ్రీనివాసరావు, పాగోలు శివనాగమల్లేశ్వరరావు, పాగోలు రాము, కుక్కల శివ నాగ గోపి, శ్రీనివాసరావు, తుళ్లూరు నరసింహారావు, వడ్లమూడి నాగరాజు , పాగోలు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాడికొండ టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణ్ నామినేషన్

నిబంధనలకు నీళ్లొదులుతూ..

తాడికొండ: తాడికొండ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా తెనాలి శ్రావణ్ కుమార్ శుక్రవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఉదయం తాడికొండ అడ్డరోడ్డు నుంచి ర్యాలీగా తరలివచ్చారు. ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్యల చేతుల మీదుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం గంగరాజుకు దాఖలు పత్రాలు అందజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కాగా నామినేషన్ ప్రక్రియలో అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన కనిపించింది. టీడీపీ, జనసేన జెండాలు పెట్టుకొని వాహనాలతో ర్యాలీగా వెళ్లడంతో పాటు మద్యం పంపిణీ జోరుగా జరిగింది. వాహనాలపై వచ్చిన యువతకు పెట్రోల్ పోయించడంతో పాటు బిర్యానీ పంపిణీ చేశారు.

కేంద్రియ విద్యాలయలో ప్రేరణ ఉత్సవం

గుంటూరు రూరల్: గుజరాత్ రాష్ట్రం వాడ్‌నగర్ వెర్నాక్యులర్ పాఠశాలలో జరగబోయే ప్రేరణ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థుల తుది ఎంపిక జరగనుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం నల్లపాడులోని పీఎం కేంద్రియ విద్యాలయలో 2024 జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారత దేశం నా విజన్, వికసిత్ భారత్, ప్రేరణ ఉత్సవానికి విద్యార్థులను ఎందుకు ఎంపిక చేయాలనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన, కవిత, చిత్రలేఖన ప్రదర్శించేలా ప్రోత్సహించడం జరిగిందన్నారు. ఈ ప్రేరణ ఉత్సవంలో జిల్లా వ్యాప్తంగా 60 పాఠశాలల నుంచి ఒక్కో పాఠశాలకు బాలుడు, బాలిక చొప్పున 120 మంది పాల్గొన్నారని తెలిపారు. వీరి నిష్పాదన మూల్యంకన అనంతరం వ్యక్తిగత ఇంటర్వ్యూలు, మార్కుల ఆధారంగా 30 మందిని ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైనవారి వివరాలను ప్రేరణ పోర్టల్‌లో అప్‌లోడు చేస్తామని డీఈఓ వివరించారు.

22 లోపు పోస్టల్ బ్యాలెట్ వివరాలు అందజేయాలి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఓటు ఉండి ఎన్నికల విధులకు ఎంపికైన అధికారులు, సిబ్బంది ఈ నెల 22వ తేదీ (సోమవారం) లోపు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కౌంటర్‌లో వివరాలు ఇవ్వాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) కీర్తి చేకూరి, పశ్చిమ నియోజకవర్గ ఆర్‌ఓ కె.రాజ్యలక్ష్మి శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గంలో ఓటు కలిగి ఉండి 2024 సాధారణ ఎన్నికల ప్రక్రియలో విధులకు ఎంపికైన మాస్టర్ ట్రైనర్లు, బీఎల్‌ఓలు, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, ఇతర సిబ్బంది, వీడియోగ్రాఫర్స్, డ్రైవర్లు ఈ నెల 22 వ తేదీలోపు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని పోస్టల్ బ్యాలెట్ హెల్ప్‌డెస్క్‌లో ఫారం-12(2 కాపీలు) అందించాలని తెలిపారు. ఫారం-12తో పాటుగా ఓటర్ ఎపిక్ కార్డ్, డ్యూటీ ఆర్డర్ కాపీ ఇవ్వాలన్నారు. హెల్ప్ డెస్క్ సిబ్బంది కార్యాలయ పని వేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉంటారని తెలిపారు.

ఓటు హక్కును తప్పక వినియోగించాలి

తెనాలి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కు కలిగిన ప్రతివారు తప్పనిసరిగా ఓటు చేయాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ముంబయి) కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు సూచించారు. స్థానిక 11వ వార్డులోని పూలే కాలనీలో కౌన్సిల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికలు, ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఓటు హక్కును ప్రజల కోసం పరిపాలన చేసే ప్రభుత్వాలు, నాయకులను ఎన్నుకోవటానికి ఉపయోగించాలని కోరారు.

GENERAL NOTICE
IN THE COURT OF THE PRL. DIST. JUDGE : GUNTUR
G.W.O.P. No. 169 / 2024

Between:
1)Miryala Sadasiva Rao, S/o. Ankamma Rao, 2) Miryala Hareesh, S/o. Sadasiva Rao, both are R/o.Door No.8-3, Jonnala Gadda(V), Guntur Rural Mandal & Guntur District. ...Petitioners
And
Nil ...Respondents

[illegible]

Schedule:Guntur Dt.,Tadikonda Sub Dt., Jonnalagadda(V),Panchayat Area, Jonnalagadda(V), D.No.256, Total extent of Ac.12-62 cents. in which an extent of Ac.1-00 cents. out of which an extent of Ac.0-50cents of dry land is being bounded by East:Land belongs to Imadabattuni Madhava Rao,South: Land belongs to Uppalapati Srinivasa Rao,West:Land belongs to Nama Jayanthi,North:Land belongs to Vadrangi Linga Rao. Within the above boundaries an extent of Ac.0-50 cents or equaling to 0.203 Hectors of dry land with entire easement rights and rite of passage.

Note: The minor ward is entitled 1/3rd undivided share in the above property.

NARALASETTY SRINIVASA RAO, G. YUGANDHAR, Advocates for Petitioner
Guntur. Cell: 9059468137

ఓటు హక్కుపై అలరించిన నమూనా ప్రదర్శన



తెనాలిఅర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 'స్వీప్' కార్యక్రమంలో భాగంగా తెనాలి మున్సిపల్ కార్యాలయం ముందు కమిషనర్ బండి శేషన్న ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఉద్యోగులు 'ఓటు వేద్దాం 91–తెనాలి మే 13న' అక్షరాలు ప్రతిబింబించే విధంగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, మున్సిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాల అధికారులు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం

తెనాలిఅర్బన్: ఫ్రైడేను డ్రైడేగా అంతా పాటించాలని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల సూచించారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లో దోమల నియంత్రణకు అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఇంటి పరిసరాల్లో ఉన్న పాత వస్తువుల్లోని నీటిని తొలగించాలని సూచించారు. దోమకాటు వలన అనే వ్యాధులు ప్రబలుతాయని చెప్పారు. తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నీటి కుంటలు, పాత వస్తువులు దోమలకు నిలయాలని చెప్పారు. వాటిని ప్రతి శుక్రవారం శుభ్రం చేయాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చేసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సుల్తానాబాద్‌లోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, బందారు మల్లీశ్వరరావు పాల్గొన్నారు.





